క్లుప్తంగా

వ్యాపారుల ఆత్మబంధువు 'ఆతుకూరి'

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



ఆతుకూరి సత్కరిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి తదితరులు

పట్నంబజారు: వర్తకులు, వ్యాపారస్తులకు ఆత్మ బంధువు ఆతుకూరి ఆంజనేయులు అని శాసన మండలి సభ్యులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి కొనియాడారు. చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడిగా రికార్డు స్థాయిలో 34వ సారి ఎన్నికైన ఆతుకూరి ఆంజనేయులును ఆదివారం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌తో కలసి ఆదివారం బ్రాడీపేటలోని ఆయన నివాసంలో సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, పార్టీ గ్రీవెన్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు సింగు నరసింహారావు చౌదరి, మహేంద్ర గులేచా పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థ 'స్పందన' రద్దు

నెహ్రూనగర్: గాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం నగరపాలక సంస్థలో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ స్థానిక సమస్యలపై నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863–2345103కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పట్నంబజార్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిరంగిపురానికి చెందిన ఏడుకొండలు, శివయ్య నల్లచెరువు నుంచి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. ఆటోలో తరలిస్తున్న 3,150 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంట ఉత్పత్తుల వృథాను అరికట్టాలి



గుంటూరు రూరల్: పంట ఉత్పత్తులలో వృథాల్ని అరికట్టి రైతులు అధిక లాభాల్ని సాధించవచ్చని ఉద్యాన శాఖ సహసంచాలకుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామంలోగల రైతునేస్తం ఫౌండేషన్‌లో సేంద్రియ ఉత్పత్తులు, వృథాలను అరికట్టే విధానంపై రైతు శిక్షణ సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల టమాటా ధరలు జూలై, ఆగస్టు మాసాల్లో విపరీతంగా పెరిగాయని, ప్రస్తుతం విపరీతంగా తగ్గాయన్నారు. ఈ పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే రైతులు పంటల సాగును పక్కకు పెట్టి వేరే మార్గాలు వెతుక్కునే అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. పంటలు పండించడంలో రైతులు తమ నైపుణ్యతను చూపించుకోగలుగుతున్నారు గానీ వాటిని నిల్వ చేసుకోవడంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సక్రమంగా నిల్వచేసుకోలేక పోవడం వల్ల సరైన ధర లభించకపోవడమో లేదా దిగుబడి వృథా కావడమో జరుగుతుందన్నారు. కాబట్టి దిగుబడి వృథాను తగ్గించవలసిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. సేంద్రియ సాగు విధానం, కషాయాలు, మిశ్రమాల తయారీతో పాటు రైతులు పండించిన వ్యవసాయ దిగుబడులకు విలువ జోడింపు వంటి అంశాలను వివరించారు. అనంతరం రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేంద్రియ రైతులు శబరీనాథ్, ఏడుకొండలు, శివనాగమల్లేశ్వరరావు రైతునేస్తం ఫౌండేషన్ చెర్మన్ వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కమ్యూనిటీ సైన్స్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చైతన్య కుమారి తెలిపారు. ఆదివారం ఏక్ తారీఖ్, ఏక్ ఘంట నినాదంతో ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య భద్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో చెత్త చెదారాలను ఏరివేశారు. ప్లాస్టిక్ నిర్మూలన గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. సహజవనరుల పరిరక్షణ గురించి కళాశాల అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ ధనశ్రీ, డాక్టర్ నిర్మలాదేవి పాల్గొన్నారు.

మీడియా డిస్‌ప్లే బోర్డుల తొలగింపు



బోర్డులు తొలగిస్తున్న పట్టణ ప్రణాళిక అధికారులు

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్: రోడ్ల వెంబడి వాహనాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న మీడియా డివైజ్ డిస్‌ప్లే బోర్డుల తొలగింపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. కమిషనర్ చాంబర్‌లో ఇటీవల జరిగిన రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఆదివారం నగరంలో ప్రధాన రోడ్ల వెంబడి ప్రకటనల బోర్డ్‌లను పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమల్లో భాగంగా ప్రధాన రహదారుల వెంబడి వాహనదారులకు అసౌకర్యంగా ఉండే హోర్డింగ్స్‌లను తొలగిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం కలెక్టరేట్, మెడికల్ క్లబ్, అమరావతి రోడ్ చిల్లీస్ జంక్షన్, జేకేసీ కాలేజీ రోడ్డు జంక్షన్, ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ జంక్షన్, నాజ్ సెంటర్, టీబీ బంగ్లాల వద్ద బోర్డ్‌లను తొలగించినట్లు తెలిపారు. కొన్ని జంక్షన్లలో ప్రకటనల బోర్డ్‌ల వల్ల ప్రజలు, వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయా డిపార్ట్‌మెంట్ అధికారులు రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో అభిప్రాయపడ్డారని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఇబ్బందికరంగా ఉన్న బోర్డ్‌ల తొలగింపునకు ఆయా ఏజన్సీల ప్రతినిధులు సహకరించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీప్లానర్లు బాబూరావు, అజయ్ కుమార్, మురళి, టీపీఎస్‌లు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

నెహ్రూనగర్/ పట్నంబజారు: ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి జన్మదినోత్సవం పురస్కరించుకుని ఆదివారం 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి సూరసాని వెంకటరెడ్డి, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- ఏఆర్ యుఆర్ యూత్ నేతలు చల్లా కోటి, ఆజం ఆధ్వర్యంలో ఆదివారం మహాత్మాగాంధీ కళాశాల సమీపంలోని విజేత గ్రౌండ్‌లో మహిళలకు ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి చీరల పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, డెప్యూటీ మేయర్ షేక్ సజీల పాల్గొన్నారు.
- ఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో గుంటూరు ప్రభుత్వాసుపత్రి, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), నిమ్మల వెంకటరమణ, గేదెల రమేష్, పూనూరి నాగేశ్వరరావు, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్ పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య పద సంకీర్తనలు



సంకీర్తలను అలపిస్తున్న సీతామహాలక్ష్మి

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికపై ఆదివారం సాయిశృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో అన్నమయ్య పద సంకీర్తనా వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం సంగీత విద్యాంసురాలు బి.సీతామహాలక్ష్మి పలు అన్నమాచార్య కీర్తనల్ని అలపించారు. వయోలిన్‌పై డి.శ్రీనివాసశాస్త్రి, ఫ్లూట్‌పై ఆర్.ప్రేమ్‌కుమార్, మృదంగంపై బి.సురేష్‌బాబు, తబలాపై పి.రమణయ్య వాయిద్య సహకారం అందించారు.

ఘనంగా అల్లు రామలింగయ్య శత జయంతి



మేకప్ ఆర్టిస్ట్ సూరిబాబును సత్కరిస్తున్న డైరెక్టర్ బాబి, సప్తగిరి

పాత గుంటూరు: గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అల్లు రామలింగయ్య నాటక కళా పరిషత్, వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పద్మశ్రీ డాక్టర్ అల్లు రామలింగయ్య శత జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మేకప్ ఆర్టిస్ట్ కె.సూరిబాబు, సినీ డైరెక్టర్ కొల్లి బాబి, జబర్దస్త్ టీం పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఆహ్వాన నాటకోత్సవాల్ని ప్రారంభించారు. తోలుగాటు శ్రీనివాసరావు రచన, దర్శకత్వంలో 'సెట్' నాటిక, గోవిందరాజుల నాగేశ్వరరావు రచన, బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వంలో 'పక్కా ఇంటి మొగుడు' హాస్య నాటికలు ఉత్సాహంగా సాగాయి. అనంతరం డైరెక్టర్ బాబి, సినీ రచయిత కోన వెంకట్, సినీ నటుడు సప్తగిరి, జబర్దస్త్ టీం గెటప్ శ్రీను, చమ్మక్ చంద్ర, సత్య, రాకెట్ రాఘవలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని కళా పరిషత్ అధ్యక్షుడు పెండెం వెంకట శివప్రసాద్, ఉపాధ్యక్షుడు ఆర్.రామకృష్ణ, కార్యదర్శి డి.సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

భవ్య హంతకులను కఠినంగా శిక్షించాలి



నెహ్రూనగర్: చిత్తూరు జిల్లాలో పెనుమూరు మండలానికి చెందిన భవ్యశ్రీపై అత్యంత దారుణంగా అత్యాచారం చేసి, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బాలాజీనగర్‌లో ఆదివారం కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన భవ్యశ్రీని పొట్టనపెట్టుకున్న నిందితులపై తక్షణ చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు



నగరంపాలెం: అరండల్‌పేటలోని శ్రీ మోహన రంగనాయక స్వామి వారి దేవస్థానం ఆవరణలో ఆదివారం రాధామాధవ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 304వ నెలనెలా వెన్నెలలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వభారతి కూచిపూడి ఆర్ట్ అకాడమి (విజయవాడ), నటరాజ సంగీత నృత్య కళాశాల ఆధ్వర్యంలో చిన్నారుల కూచిపూడి నాట్యాలు సభికుల్ని అలరించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ మాజేటి గురవయ్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయలక్ష్మి పాల్గొన్నారు. అసోసియేషన్ నిర్వాహకులు షేక్ ఖలీల్, నృత్య దర్శకుడు ఎం.కాశీ విశ్వనాథ్, అనంతుల విజయకుమారి పాల్గొన్నారు.

'స్వచ్ఛ గుంటూరు'కు సహకరించాలి



30వ డివిజన్‌లో రోడ్లు శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ వెంకటరెడ్డి



56వ డివిజన్‌లో రోడ్లు శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ కనకదుర్గ



టీజేపీఎస్ కళాశాల విద్యార్థులతో రవిశంకర్‌రెడ్డి, సుధీర్‌కుమార్



రోడ్లు పరిశుభ్రం చేస్తున్న డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ రాజకుమారి, తదితరులు

నెహ్రూనగర్: స్వచ్ఛ గుంటూరుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని 30వ డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, 56వ డివిజన్ అయిశెట్టి కనకదుర్గ కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం 30, 56వ డివిజన్లలో కార్పొరేటర్లు రోడ్లు ఊడ్చి పరిసరాల్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, తద్వారా స్వచ్ఛ గుంటూరు సాధ్యమవుతుందని వివరించారు.

సామాజిక పరిశుభ్రతకు పెద్దపీట వేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: సామాజిక పరిశుభ్రతకు యువతరం పెద్దపీట వేయాలని ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగ సమన్వయకర్త డాక్టర్ డి. రవిశంకర్ రెడ్డి సూచించారు. ఆదివారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన స్వచ్ఛతా హి సేవలో పాల్గొన్న టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ విద్యార్థులు శ్రమదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత తప్పనిసరని, ప్రతి ఒక్కరు నివాస, పని ప్రదేశాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి అని చాటిన మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ విభాగ నిర్వహణాధికారి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, టీజేపీఎస్, ప్రభుత్వ మహిళా కళాశాల, మాజేటి గురవయ్య, చలమయ్య, హిందూ, ఏసీ కళాశాల, జేకేసీ, సిమ్స్, బీహెచ్, విజ్ఞాన్, హిందూ ఫార్మసీ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగాల వలంటీర్లు పాల్గొన్నారు.

కొత్తపేటలో స్వచ్ఛభారత్

గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేటలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ రాజకుమారి, పలువురు వైద్య సిబ్బంది కొత్తపేటలోని పలు ప్రాంతాల్ని రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి చుట్టుపక్కల మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. నీరు నిలిచి ఉండటం వల్ల దోమలు పెరిగి అనేక వ్యాధులు కలుగజేస్తాయని చెప్పారు. డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఇంట్లోని చెత్తను చుట్టుపక్కల పడి వేయకుండా పారిశుధ్య సిబ్బందికి వేరు చేసి ఇవ్వాలని సూచించారు.

స్వచ్ఛతాహీ సేవలో పాటిబండ్ల స్కూలు విద్యార్థులు



దేవస్థాన ప్రాంగణంలో శ్రమదానం చేస్తున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల ఆధ్వర్యంలో 'స్వచ్ఛతాహి సేవ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేవస్థాన ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని బాధ్యతతో నిర్వహించడంతో పాటు పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుతూ మొక్కల్ని పెంచాలని సూచించారు. దీనివల్ల కాలుష్యం తగ్గి భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలీ, వాతావరణం అందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల గౌరవాధ్యక్షుడు యలమంచిలి శివాజీ, దేవస్థాన పాలక మండల అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య, పాఠశాల కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాద రావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ విద్యార్థుల స్వచ్ఛ భారత్



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులు ఆదివారం వడ్లమూడిలో స్వచ్ఛతా హీ సేవా, మెడికల్ క్యాంప్‌తో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొనాలని సూచించారు. వైరల్, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసారు. గ్రామంలోని ప్రధాన రహదారులను శుభ్రం చేసి చెత్తాచెదారాన్ని తొలగించారు. గుంటూరు అమరావతి హాస్పిటల్ డాక్టర్ శివ రత్నాకర్ ఆధ్వర్యంలోని వైద్య బృందం సహాయంతో గ్రామస్తులకు రక్త పరీక్షలతో పాటు బీపీ వంటి ఇతర ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. ''ఫీడ్ ద హంగర్'' అనే నినాదంతో గుంటూరు నాయుడు పేట డంప్ యార్డ్ వద్ద నివసిస్తున్న ప్రజలకు అవసరమైన ఆహారాన్ని అందించారు. ప్రపంచంలో వేల మంది ప్రజలు సమయానికి సరైన తిండి దొరకక ఆకలితోనే నిద్రిస్తున్నారు. అందువలన పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు, రోజువారీ ఇళ్లల్లో మిగిలిన ఆహారాన్ని వృథాగా పడేసే బదులు అవసరమైన వారికి అందించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మానవతావాది ఎం.ఎస్. స్వామినాథన్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశంలో ఆకలి చావులు లేకుండా చేసిన ఎం.ఎస్. స్వామినాథన్ గొప్ప మానవతావాదని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, ప్రొఫెసర్ ఎం.ఎస్. స్వామినాథన్ సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలు ఆకలితో చనిపోతున్న పరిస్థితుల్ని చూసి చలించిపోయిన స్వామినాథన్ వ్యవసాయ శాస్త్రవేత్తగా అనేక అధిక దిగుబడి ఇచ్చే నూతన వరి వంగడాల్ని సృష్టించి, దేశంలో ఆహార ధాన్యాల్ని మిగులు స్థాయికి తీసుకువచ్చారని కొనియాడారు. వరి వగడాల రూపకల్పనలో ఆయన కృషి అమోఘమని తెలిపారు. విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎన్. వేణుగోపాలరావు మాట్లాడుతూ ఎం.ఎస్. స్వామినాథన్ శాస్త్రవేత్తగా పరిశోధనలతో పాటు రైతుల సమస్యలపై విశేషంగా కృషి చేశారని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధరలు, మహిళా రైతుల సమస్యలతో పాటు ఆహార భద్రత చట్టం కోసం కృషి చేశారని వివరించారు. సమావేశంలో ఎల్ఐసీ నాయకులు వి.వి.కె.సురేష్, డాక్టర్ ఏ. సత్యనారాయణ ప్రసాద్, బి. ప్రసాద్, నేతాజీ, పి. వెంకటేశ్వరరావు, సీహెచ్. ఆదినారాయణ, బి. ఉదయ్‌భాస్కర్, ఎస్.ఎం. సుభాని, జి. వెంకట్రావు, బి. శంకర్‌సింగ్ పాల్గొన్నారు.

హైస్కూలుకు రోటరీ క్లబ్ టీవీ వితరణ



హెచ్ఎంకు ఎల్ఈడీ టీవీ అందజేస్తున్న శ్రీనివాసరావు, రాజ్‌గోపాల్, శ్రవంత్, సుధాకర్

గుంటూరు ఎడ్యుకేషన్: కొరిటెపాడులోని శ్రీ రంగాచార్య మెమోరియల్ ఓరియెంటల్ (ఎస్ఆర్ఎంవో) హైస్కూల్లో విద్యార్థులకు డిజిటల్ తరగతుల నిర్వహణ కోసం రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటీనియల్ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు నేతృత్వంలో రూ.20వేలతో ఎల్ఈడీ టీవీ బహూకరించారు. పాఠశాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువును కష్టంగా కాకుండా ఇష్టపడి చదివితే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోగలరని సూచించారు. పాఠశాలకు ఎల్ఈడీ టీవీని బహూకరించిన రోటరీ క్లబ్ ప్రతినిధులకు పాఠశాల హెచ్ఎం లలిత, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి రాజ్‌గోపాల్, కోశాధికారి శ్రవంత్, సభ్యులు మద్దినేని సుధాకర్, ముప్పాళ్ల సుబ్బారావు, రాజ్‌గోపాల్, ఏటుకూరి రత్న, ఎం. వీరయ్య, వి. సురేష్, నూతలపాటి తిరుపతయ్య, మానవత సంస్థ కార్యదర్శి రమణబాబు, వీరరాఘవ, ఎం. పెరుమాళ్ పాల్గొన్నారు.

మీడియాలో అసత్య ప్రచారాలు తగదు

మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కిశోర్‌బాబు

నెహ్రూనగర్: అమరావతి రాజధానిలో రైతుల్ని బెదిరించి వారి నుంచి అసైన్డ్ భూములు లాక్కున్నానని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, తనపై దుష్ప్రచారాలు మానుకోవాలని మాజీ మంత్రి రావెల కిశోర్ బాబు తెలిపారు. బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో ఆదివారం 2014 నుంచి 2019 వరకు ప్రత్తిపాడు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై పోస్టర్లను ఆవిష్కరించారు. కిశోర్‌బాబు మాట్లాడుతూ ఈ రోజు వరకు తన పేరు మీద గానీ, కుటుంబ సభ్యుల పేరు మీద గానీ రాజధానిలో సెంటు భూమి కూడా లేదని తెలిపారు. సోషల్ మీడియాలో తనపై వివిధ గ్రూపుల్లో దుష్ప్రచారం జరుగుతోందని, అందులో వాస్తవం లేదని వివరించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల్ని ముందు ఎన్నడూ లేనివిధంగా సంపూర్ణంగా కేటాయించినట్లు చెప్పారు. అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాల్ని అవినీతికి తావు లేకుండా చిత్తశుద్ధితో అమలుచేసిన విషయం గుర్తు చేశారు. సోషల్ మీడియాలో, ఇతర మాధ్యమాల్లో తనపై దుష్ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని కిశోర్‌బాబు తెలిపారు.

సమష్టి కృషి వల్లే ఇస్రో విజయం



మానస దంపతులకు సత్కారం

నగరంపాలెం: సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్, గెట్ టు గెదర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో ఇస్రో శాస్త్రవేత్త మానస దంపతుల్ని ఘనంగా సత్కరించారు. మహిళలు ఇటువంటి బృహత్తర కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మానస మాట్లాడుతూ ఇస్రో విజయం సమష్టి కృషికి నిదర్శనమని తెలిపారు. కార్యక్రమానికి మన్నే సుబ్బారావు అధ్యక్షత వహించగా, సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నూతలపాటి తిరుపతయ్య, కార్యదర్శి దాసరి హనుమంత రావు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి వర్ధిల్లాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మానవత సంస్థ నిర్వాహకులు, సభ్యులు

నగరంపాలెం: ప్రపంచ శాంతి వర్ధిల్లాలని కోరుతూ మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పాత గుంటూరు యాదవ ఉన్నత పాఠశాల నుంచి నందివెలుగురోడ్డులోని గాంధీ విగ్రహం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలైన నలభై మందికి ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ప్రముఖ గాయకుడు గని ఆలపించిన దేశభక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. మానవత చైర్మన్ పావులూరి రమేష్, డైరెక్టర్లు ఉప్పల సాంబశివరావు, బీఎన్ మిత్ర, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోశాధికారి సాయిరాం, వి సదాశివరావు, తాతిరెడ్డి తిరుపతిరెడ్డి, సత్యనారాయణ, అబ్బూరి కోటేశ్వర రావు, స్టెప్ డైరెక్టర్ ప్రత్యూష సుబ్బారావు, మానవత మహిళా విభాగం చైర్మన్ విజయలక్ష్మి, మహిళా డైరెక్టర్ నాగ దుర్గారాణి పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు గుంటూరు, 3వలైను, సీతారామ నగర్ వాస్తవ్యులు శ్రీ పొకనాటి శేషగిరిరావు గారి కుమారుడు కృష్ణప్రవంత్ గారు, నిడుముక్కల గ్రామ కాపురస్తుడు కాలారి పావయ్యగారి కుమారుడు కాలారి నారాయణ గారి వద్ద నిడుముక్కల గ్రామం తాలుకు డి.నెం.9-బి2లో య.0-54 3/4 సెంట్ల భూమి మరియు పై గ్రామములో డి.నెం.8 మరియు 9బి లో య.1-18 సెంట్ల భూమిని కొనుగోలు చేసి అడ్వాన్సు పైకము ఇచ్చియున్నారు. వారు పై ఆస్తిని విక్రయ దస్తావేజు 1412/2003 మరియు 1014/2017 దస్తావేజుల క్రింద కొనుగోలు చేసి ఉన్నారని, ఆ ఆస్తి తాలుకు తమ పేరు మీద ఉన్న పట్టాదారు పాసుపుస్తకములు, అడంగలు చూపించియున్నారు. నా క్లయింటుపై ఆస్తిని పూర్తి పైకము ఇచ్చి తమ పేర రిజిస్టరు చేసుకొనుటకు సిద్ధముగా ఉన్నారు. అందుచే పై ఆస్తికి సంబంధించి ఎవ్వరికైనను అభ్యంతరములున్నచో నాకు గాని, నా క్లయింటుకు గాని వ్రాతపూర్వకముగా వారం రోజుల లోపు తెలియచేయవలసినది. లేనిచో పై ఆస్తిని నా క్లయింటు రిజిస్టరు చేయించుకొనగలరు.

ఇట్లు : కె.వి.ఆర్.హెచ్. ప్రసాద్, M.Sc., B.L., అడ్వకేట్, డి.నెం. బి–1/72, రవీంద్రనగర్, గుంటూరు. 98490 84816